సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం | 25 | జూన్ | 2024



పనస పండు.. పోషకాలు మెండు

పనసపండు అంటే అందరికీ ఇష్టం. బాగా పండిన పనస తొనల రుచిని మాటల్లో వర్ణించలేం. పనస విత్తనాలలో చాలామందికి తెలియని పోషకాలు ఉన్నాయి.

- 8లో



కక్షసాధింపు చర్యలను ఎదుర్కొందాం

ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల కక్ష సాధింపు చర్యలను కలిసి కట్టుగా ఎదుర్కొందామని ఎమ్మెల్యే సుధ పేర్కొన్నారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /26.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 26.4 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

భవిష్యత్తు మనదే



మహిళ సమస్యను ఆలకిస్తున్న వైఎస్ జగన్

- ముందుంది మంచికాలం
- క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొందాం
- నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
- కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం
- మూడు రోజుల పర్యటన అనంతరం బెంగళూరుకు పయనం



పులివెందుల క్యాంపు కార్యాలయం వద్ద అభిమానులతో ఉత్సాహంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి కడప/పులివెందుల : 'కష్టకాలంలో ఎదురొడ్డి పోరాడుదాం.. ఎప్పుడూ ఇదే కాలం ఉండదు.. మనం ఎన్నో మంచి పనులు చేశాం.. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించాం.. కార్యకర్తలెవరూ నిరాశ చెందవద్దు.. టీడీపీ దమనకాండను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లడం ద్వారా భవిష్యత్తు మనదే' అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధైర్యం చెబుతూనే దిశా నిర్దేశం చేస్తూ వచ్చారు. బాధితులకు పార్టీతోపాటు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అదే అభిమానం.. అదే ఆత్మీయత

పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలతోపాటు కార్యకర్తలు, శ్రేణులు అదే అభిమానం.. అంతకంటే ఎక్కువ ఆత్మీయత చూపారు. ప్రతి ఒక్కరూ మాజీ సీఎంతో కరచాలనం చేసేందుకు ఉత్సాహం ప్రదర్శించారు. తమ అభిమాన నేతతో సెల్ఫీలు తీసుకుంటూ సంతోషంగా కనిపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా వారిని పేరుపేరునా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కదిలి వచ్చిన జన తరంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో ఉన్నారన్న విషయాన్ని పత్రికలు, సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ప్రజలు తండోప తండాలుగా తరలి వచ్చారు. మొదటిరోజు విపరీతంగా జనం తరలి రావడంతో పోలీసులు అదుపు చేయడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో రెండు, మూడో రోజుల్లో కార్యాలయం వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేశారు. ఎక్కడ చూసినా భారీ గేట్ల వెంబడి జనం ఉన్నారు. మాజీ సీఎం కార్యాలయంలోకి ఒక్కొక్కరిని పిలుస్తూ ప్రతి ఒక్కరికి సమయం కేటాయిస్తూ మాట్లాడుతూ కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఆయన పులివెందులలో పలు కార్యక్రమాల నిమిత్తం బయటికి వచ్చిన సందర్భంలో ఒక్కసారిగా బారికేడ్ల వద్ద ఉన్న జనమంతా చేతులు ఊపుతూ జై జగన్ అంటూ నినదించారు. అక్కడ కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలువురితో కరచాలనం చేశారు. అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.



వైఎస్ జగన్‌కు సమస్య విన్నవిస్తున్న యువతి

వైఎస్ జగన్‌ను కలిసిన పలువురు నేతలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం క్యాంపు కార్యాలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు కలిశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్న వెంట ఉంటూ అడుగడుగునా ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపారు. ఎంపీతోపాటు మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత తిరుపేల రెడ్డి తదితరులు కలిసి రాజకీయ తదితర అంశాలపై చర్చించారు.

బెంగళూరుకు పయనం

సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారిగా మూడు రోజుల పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. తొలిసారిగా సొంత గడ్డపైన అడుగు పెట్టిన ఆయనను అక్కున చేర్చుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా రాయలసీమ ప్రజలతో మమేకమైన ఆయన సోమవారం మధ్యాహ్నం పర్యటన ముగించుకుని సతీమణి వైఎస్ భారతీరెడ్డితో కలిసి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.



వైఎస్ జగన్‌ను కలిసేందుకు వచ్చిన వారితో కిటకిటలాడుతున్న క్యాంపు కార్యాలయ ఆవరణం



వైఎస్ జగన్‌ను చూసేందుకు బారులు తీరిన అభిమానులు



అభిమాన నేతతో సెల్ఫీ తీసుకుంటూ..



వివాహ ఆహ్వాన పత్రికను పరిశీలిస్తూ..



పర్యటన అనంతరం బెంగళూరుకు పయనమైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గ్రీవెన్స్‌సెల్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌సెల్)లో ప్రజలు సమర్పించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ విజయ రామరాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. జిల్లాలో డయేరియా నియంత్రణకు అధికారులు కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. మురికినీటి గుంతలు లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులను కోరారు. ప్రజా ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల్లో క్లోరిన్ ట్యాబెట్లు వేయాలని, పబ్లిక్ కొళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. విద్యా సంస్థలు, ప్రజలు అధికంగా గుమికూడే ప్రదేశాలు, మార్కెట్లలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి నిల్వలు ఉన్నచోట్ల గంబూషియా చేపలు వదలాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ చంద్రమోహన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

వైవీయూలో పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు ప్రారంభం

వైవీయూ : ఏపీ ఆర్ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మొదలైంది. అందులో భాగంగా కడప యోగివేమన విశ్వవిద్యాలయంలో తొలిరోజు ఫైన్‌ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్‌నానో టెక్నాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి సబ్జెక్ట్ నిపుణులను ఆహ్వానించి ఇంటర్వ్యూలను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు ఇంటర్వ్యూలో ఏర్పాట్లు పూర్తిచేసి నిర్వహిస్తున్నామన్నారు.ఈ నెల 25వ తేదీన మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు, 26వ తేదీన మ్యాథమెటిక్స్, 27వ తేదీన సైకాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. విద్యార్థులు రీసెర్చ్ ప్రపోజల్‌తో పాటు అన్ని రకాల అర్హత పత్రాలతో ఆయా తేదీలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

'మిథున్' మెరుపు!

- హ్యాట్రిక్ ఎంపీగా పీవీ మిథున్‌రెడ్డి
- మూడోసారి ఎంపీగా ప్రమాణస్వీకారం



రాజంపేట : సార్వత్రిక ఎన్నిల్లో లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి హ్యాట్రిక్ ఎంపీగా నిలిచారు. ఆరుదశాబ్దాల అరుదైన పోరులో మిథున్‌రెడ్డి మెరిశారు. ఈ నేపథ్యంలో సోమవారం హ్యాట్రిక్ ఎంపీగా లోక్‌సభలో పీవీ మిథున్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి గాలి వీస్తున్న తరుణంలో మిథున్‌రెడ్డి మాత్రం మెజార్టీలో వెనుకంజ వేయలేదు.

రాజకీయ దిగ్గజాలను మట్టికరిపించి..

తొలిసారి మిథున్‌రెడ్డి 2014లో 1,74,062 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నాటి బీజేపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని ఆయన ఓడించారు. 2019లో మిథున్‌రెడ్డి 2,68,284 ఓట్ల మెజార్టీని సాధించారు. అప్పట్లో టీడీపీ అభ్యర్థి సత్యప్రభపై విజయం సాధించారు. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఓడించారు.

అరుదైనపోరులో విజేతగా..

అరుదైన పోరులో పీవీ మిథున్‌రెడ్డి విజేతగా నిలిచారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి (బీజేపీ) మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. ఆరు దశాబ్దాల తర్వాత ఒకే సామాజికవర్గం మధ్య లోక్‌సభ ఎన్నికల పోరు జరిగింది. మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. రాజంపేట లోక్‌సభకు బలిజ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థుల మధ్య పోటీ కొనసాగుతూ వచ్చింది. కాగా రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే లోక్‌సభ ఎన్నిక బరిలో ఉండటంతో అరుదైన పోరుగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో మిథున్‌రెడ్డి తన పట్టును మూడోసారి కూడా నిలుపుకున్నారు.

న్యూస్‌రీల్

26న డయల్ యువర్ ఆర్‌ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కార నిమిత్తం ఈనెల 26వ తేదీన డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు 9959225848 నంబర్‌లకు ఫోన్ చేసిగానీ, వాట్సాప్ చేసిగానీ సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో వర్షం



కడపలో మేఘావృతమైన అకాశం

కడప అగ్రికల్చర్ : ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వర్ష కురిసింది. కాశినాయన మండలంలో అత్యధికంగా 7 మిల్లీమీటర్లు, బద్వేల్‌లో 1.6, రాజుపాలెంలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టమ్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలనీ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ సైబర్‌క్రైమ్ డాట్ జీఓవి డాట్ ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో టోల్ ఫ్రీ నెంబర్: 1930 కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు జిల్లా ఎస్పీ సూచించారు.

అరచేతిలో వాతావరణం

- ప్రత్యేక యాప్‌లను రూపొందించిన కేంద్రం
- గ్రామస్థాయిలోనే వాతావరణ అంచనా
- ఫోన్‌లో ఈ యాప్ ఉంటే వర్షం, పిడుగుల సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు పసికట్టే సౌలభ్యం





కడప అగ్రికల్చర్ : వానరాకడ.. ప్రాణం పోకడ ఎవరికెరుక అనేది పాత నానుడి. నేడు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో వర్షం రాకను, పిడుగులు పడే ప్రాంత సమాచారాన్ని ముందుగా తెలుసుకుంటున్నారు. సంబంధిత సమచారాన్ని మనకు ముందుగానే మేసేజీల రూపంలో సెల్‌ఫోన్ల ద్వారా చేరవేస్తున్నారు. దీంతో మానవాళి అప్రమత్తం అవుతున్నారు. ఫలితంగా భారీ వర్షాలు, ఈదురు గాలులు, పిడుగుపాటు తదితర ప్రకృతి విపత్తుల నుంచి పూర్తిగా బయట పడలేకపోయినా కొంత నష్ట శాతాన్ని తగ్గించుకునే వెసులుబాటు కలిగిందని అన్నదాతలు, ప్రజలు, పశువులు, గొర్రెల కాపరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అవకాశాన్ని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) కల్పించింది. దీంతో గ్రామస్థాయిలోనే వాతావరణం అంచనాలను విడుదల చేస్తోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్‌తో పాటు దానికి ఇంటర్‌నెట్ సౌకర్యం ఉంటే చాలు వాతావరణం వివరాలు తెలుసుకుని అప్రమత్తం అయ్యే అవకాశం కలుగుతోంది.

వారం ముందే మేఘదూత్...

పంటలసాగులో విత్తనం నుంచి ఎరువులు వేసే సమయం లేదా పంట నూర్పిడి సమయంలో రైతులను నష్ట పరిచేది ముఖ్యంగా వర్షమే. అలాంటి నష్టాల నుంచి బయటపడేందుకు మేఘదూత్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. దీని సాయంతో వారం ముందుగా నాలుగు, ఐదు రోజుల వాతావరణ మార్పులు, వర్షసూచన సహా ఆకాశం మేఘావృతం అవుతుందా, లేదా.. గాలులు ఏ దిశ నుంచి ఏ దిశకు వీస్తాయి వంటి సమాచారంతోపాటు తేమశాతం, ఉష్ణోగ్రత వివరాలను తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వాతావరణ సమాచారంతో అగ్రో మెట్‌ఫీల్డ్ యూనిట్లు(ఏఎంఎఫ్‌యూ) రైతులకు మెసేజ్ రూపంలో సమాచారం పంపుతున్నాయి. దీంతో రైతులు అప్రమత్తమయ్యే ఆకాశం ఏర్పడింది,

వర్షాన్ని గుర్తించేందుకు 'రెయిన్ అలారమ్'

గూగుల్ ప్లే స్టోర్ నుంచి రెయిన్ అలారం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వినియోగదారుడు అందించిన సమాచారం మేరకు అతను ఉండే ప్రాంతానికి సమీపంలోని 20 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడెక్కడ వర్షం పడే సూచనలున్నాయో క్షణాల్లో తెలుసుకోవచ్చు. వర్షం ముప్పును ముందే తెలుసుకుని జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అలాంటి సమాచారం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

మెరుపులను తెలిపే 'దామిని'

వాతావరణంలో మార్పు చోటు చేసుకోగానే ఎప్పటికప్పుడు మెరుపు హెచ్చరికలను తెలియచేసేందుకు దామిని యాప్ ఉపయోగపడుతుంది. దీని సాయంతో సమీపంలో 20 కిలోమీటర్ల పరిధిలో ఐదు నుంచి 20 నిమిషాల వ్యవధిలో ఎక్కడ పిడుగు పడే ఆకాశం ఉందో అప్రమత్తం చేస్తుంది. మెరుపు ఎందుకు వస్తుంది.. మెరపు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈయాప్‌లో వివరించారు. లోకేషన్ ఆధారంగా ఎక్కడెక్కడ మెరుపులు వచ్చే అవకాశం ఉందో సూచిస్తుంది, పిడుగు పడినప్పుడు తోటి వారికి అందించాల్సిన వైద్యసాయం, శ్వాస ఆగిపోతే నోటి నుంచి శ్వాసను అందించడం, గుండె చప్పుడు ఆగిపోతే సీపీఆర్ చేయడం తదితర వివరాలతో పాటు పిడుగు పడినప్పుడు ప్రాథమికంగా చేయకూడనివి, చేయాల్సిన పనులు కూడా దీని ద్వారా తెలుసుకోవచ్చు.

పిడుగు సమాచారానికి 'వజ్రపాత్'

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ గుర్తుపై నొక్కితే రెండు రకాల సమాచారం వస్తుంది. ఎడమవైపు పిడుగు గుర్తు, పిడుగు సమాచారం కనిపిస్తుంది, అక్కడ నొక్కితే మనం ఉన్న ప్రాంతం సహా మ్యాప్ కనిపిస్తుంది. రెడ్, ఆరెంజ్, ఎల్లో కలర్లతో వలయాలు కనిపిస్తాయి, వీటి పక్కనే 8,15,30 అంకెలుంటాయి, ఈ అంకెల ప్రకారం అంటే కొద్ది సేపట్లో అంతదూరంలో (కిలోమీటర్లలో) పిడుగు పడే అవకాశం ఉందని చూపిస్తుంది, . ఎంత దూరంలో పడుతుందో పిన్ రూపంలో స్పష్టత ఇస్తుంది, యాప్ కుడి భాగంలో పిడుగుపాటు హెచ్చరికలు తెలిపే బటన్ ఉంటుంది, యాప్ ఆన్ చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం కావచ్చు.

రైతులకు అనేక ప్రయోజనాలు...



రైతులకు వర్షసూచన తెలియక విత్తనాలు వేసుకోవడం, పురుగుమందులు పిచికారీ చేసకోవడం, రసాయనిక ఎరువులు చల్లుకోవడం, పంటలను నూర్పిడి చేసుకోవడం వల్ల తీవ్రంగా నష్టపోవడం సాధారణంగా జరుగుతూ ఉంటాయి. కానీ ఇప్పుడు వెదర్‌యాప్ అందుబాటులోకి రావడంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఏర్పడింది. ఈ యాప్‌ల వల్ల రైతులకు చాలా ప్రయోజనం ఉంది. వర్షం వల్ల కలిగే నష్టాలకు కొంత దూరంగా ఉండే అవకాశం ఎర్పడింది. ఈ యాప్‌లపై రైతులు అవగాహన పెంచుకోవాలి. - డాక్టర్ వీరయ్య, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రయోజనం

దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం దాని అనుబంధ రంగాలు ఎంతో ప్రాణధారంగా మారాయి. విత్తు నాటడం మొదలు పంట విక్రయం వరకు అడుగడుగునా అన్నదాతలకు సవాళ్లే.వీటిలో సింహభాగం వాతావరణ పరిస్థితులదే.ఎప్పటికప్పుడు వాతావరణంలో అనూహ్యమార్పులు చోటుచేసుకుంటూ అనుక్షణం సవాళ్లు విసురుతూ ఉంటోంది. వర్షాలు, పెనుగాలులు తీవ్ర ఆర్థిక నష్టానికి కారణమవుతుంటాయి.పిడుగుపాటు నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు, గొర్రెలు, పశువుల కాపర్లు విగత జీవులుగా మారకుండా రక్షించుకునేందుకు వెసులుబాటు కలిగింది.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


కుంచం అనంతరెడ్డి (ఫైల్)

కడప అర్బన్ : వల్లూరు మండలం చెరువుకిందపల్లికి చెందిన కుంచం అనంత రెడ్డి(30) గత రెండు రోజుల నుంచి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. స్నేహితులతో కలిసి బయటికి వచ్చిన అతడు ఇంటికి తిరిగి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే సామాగ్రి చోరీ కేసులో ఒకరిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సిబ్బంది సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు...కడప రైల్వే యార్డులో సామాగ్రిని దేవుని కడపకు చెందిన శివమణికంఠ చోరీ చేశారని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గుంతకల్లు రైల్వే కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, రామచంద్ర, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు మాయం

పీలేరు : ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.1.80 లక్షలు మాయం చేసిన సంఘటన సోమవారం పీలేరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. స్థానిక తిరుపతి రోడ్డులోని చౌడేశ్వరీ నగర్‌లో నివాసమున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి సిప్పాల రమేష్‌కు బరోడా బ్యాంకులో ఖాతా వుంది. గత బుధవారం మొబైల్ పనిచేయకపోవడంతో మరమ్మతుల కోసం పట్టణంలోని ఓ మొబైల్ షాప్‌లో ఇచ్చాడు. శనివారం ఆదే నెంబర్‌తో కొత్త సిమ్ కార్డు తీసుకున్నాడు. సోమవారం సిమ్ యాక్టివేట్ అయిన అనంతరం తన ఖాతా నుంచి రూ. 1.80 లక్షలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో రమేష్ ఖంగు తిన్నాడు. అనంతరం బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమారుడి వివాహం కోసం వడ్డీకి తెచ్చిన ఆరు లక్షల రూపాయల్లో రూ.1.80 లక్షలు మాయం అయినట్లు బాధితుడు తెలిపాడు.

పనస పండు.. పోషకాలు మెండు

పనసపండు అంటే అందరికీ ఇష్టం. బాగా పండిన పనస తొనల రుచిని మాటల్లో వర్ణించలేం. చాలామంది పనస తొనలు తిని అందులో విత్తనాలు పడేస్తుంటారు. మరికొందరు వీటిని ఉడికించి, ఇంకొందరు నిప్పులలో కాల్చి తింటారు. కొందరు సంప్రదాయ వంటలలో పనస విత్తనాలు వాడతారు. అయితే పనస విత్తనాలలో చాలామందికి తెలియని పోషకాలు ఉన్నాయి. అవేంటో.. వీటిని తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో తెలుసుకుంటే..

- మెట్ట ప్రాంతాల్లో పంటకు డిమాండ్
- ఇతర ప్రాంతాల నుంచి దిగుబతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పనస పండు.. పేరు వింటేనే మెట్ట ప్రాంతం గుర్తుకు వస్తుంది. కానీ ఈ పంట ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రైల్వేకోడూరు, తదితర ప్రాంతాల్లో కూడా సాగు చేస్తున్నారు. నిమ్మ, బత్తాయి, మామిడి, కొబ్బరి, జామ తోటల్లో ఎక్కువగా ఈ పనస తోటలు సాగుచేస్తున్నారు. రుచి అధికంగా ఉండడంతో ఈ పండ్లకు ఇపుడు మంచి గిరాకీ ఉంది. నగరంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ తోటల నుంచి తెచ్చిన పనస కాయలను రోడ్ల ప్రక్కన, దుకాణాల వద్ద విక్రయిస్తున్నారు.

ఆరోగ్య ప్రదాయిని

పనస పండుకు ఆరోగ్య ప్రదాయినిగా పేరుంది. ఈ పండ్లలో ఖనిజాలు అధికంగా ఉంటాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఏర్పడే ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. క్యాన్సర్ కారక కణాలకు వ్యతిరేకంగా పోరాడతాయి. చాలా మందిలో మలబద్ధకం, అజీర్తి సమస్యలను పనస పరిష్కరిస్తుంది. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరచడంతో పాటు శరీరంలోని పెద్ద పేగు శుభ్రపడి మల బద్ధకం సమస్య పోతుంది. అలాగే ఎక్కువ మంది కంప్యూటర్‌పై పనిచేసేవారు, అధికంగా ప్రయాణం చేసే వారు చాలామంది కంటి చూపు సమస్యతో బాధ పడుతుంటారు. పనస తొనలు తినడంతో చూపు మెరుగుపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేగాక కడుపులో మంట, పుండ్లు ఏర్పడితే పనసతో నయమవుతుందని వైద్యులు సైతం నిర్ధారిస్తున్నారు. క్యాల్షియం, శరీరంలోని ఎముకల బలోపేతానికి ఉపయోగపడుతుంది.


చెట్టుకు పనసకాయలు


పనస పండ్లు

పోషకాలు ఇలా

పనసలో మెరుగైన పోషకాలు ఉన్నాయి. కార్బోహైడ్రేట్స్ 23.25 మి.గ్రా, ప్రొటీన్లు 1.72 మి.గ్రా, ఫైబర్ 1.5 మి.గ్రా, చక్కెర 19.8 మి.గ్రా, విటమిన్‌–ఏ 5 మి.గ్రా. విటమిన్‌–బి1 నుంచి బి9 వరకు ఉన్నాయి.

బెంగళూరు నుంచి దిగుమతులు

పనస ధరలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. రుచికరంగా ఉండడంతో ఎక్కువమంది తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా విజయవాడ, బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దిగుబడులు చేస్తున్నారు. పెద్ద పనస కాయ ధర రూ. 300–600 వరకు పలుకుతోంది. కిలో ప్రకారమైతే రూ. 200 పనస తొనలను అమ్ముతున్నారు. ఎక్కువ మంది పనస కాయలు కొనుగోలు చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు తెలియజేస్తున్నారు.

పోషకాలు అధికం



పనస పండులో పోషకాలు అధికంగా ఉంటాయి. ఎక్కువగా మెట్ట ప్రాంతాల్లోనే పండిస్తున్నారు. ఈ పండులో పొటాషియం 448 మి.గ్రా, క్యాల్షియం 24 మి.గ్రా, మ్యాగ్నిషియం 29 మి.గ్రా. ఉంటాయి. పనస పండ్లు శరీరారికి ఎంతగానో మేలు చేస్తాయి.

– భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యులు, కడప

పిల్లలకు ఇష్టం



వేసవిలో సెలవులకు ఇళ్లల్లో ఉంటున్న పిల్లలు పనస పండ్లను ఇష్టంగా తింటారు. ఇవి తినడానికి ఎంతో రుచికరంగా ఉంటాయి. అందుకు పిల్లలకు ఎక్కువగా ఈ పండ్లను తినిపిస్తుంటాం. అంతేకాకుండా ఈ పండు తినడం ప్రయోజనకరంగా ఉంటుంది.

– దేవరాజు, కడప

చెట్టుపై నుంచి పడి.. ఒకరికి గాయాలు

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. చింతయ్యగారికోటకు చెందిన చిన్నప్ప కుమారుడు శ్రీనివాసులు(44) కూలి పనుల్లో భాగంగా సోమవారం అల్లనేరేడు కాయలు కోసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కోస్తుండగా, ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అగ్నిప్రమాదంలో బాలికకు..

మదనపల్లె : అగ్ని ప్రమాదంలో బాలిక తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె ఆర్.ఆర్.కల్యాణ మండపం సమీపంలో నివాసముంటున్న లక్ష్మీనారాయణ కుమార్తె ఎం.కీర్తి(5) ఉదయం స్నేహితులతో కలిసి ఆడుకునేది. ఇదే క్రమంలో ఉదయం ఆడుకుంటుండగా, స్థానికంగా చెత్తకు కొందరు నిప్పు పెట్టారు. కొంతసేపటి తర్వాత ఓ మహిళ చెత్తను మంటలో వేయడంతో అక్కడి ఓ బాటిల్ పగిలి బాలికకు మంటలు వ్యాపించి కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్సలు పొందుతోంది.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మెడికో మృతి


మెడికో సజని (ఫైల్)

బనశంకరి : మంగళూరులో మెడిసిన్ పీజీ చదువుతున్న వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన వైద్య విద్యార్థిని వైద్యుల నిర్లక్ష్యంతోనే డెంగీ జ్వరంతో మృతిచెందిందని కుటుంబీకులు ఆరోపించారు. ఎర్రగుంట్ల మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పి.మాధురి, వెంకటరమణారెడ్డి కుమార్తె పడిగపాటి సృజని (27) మంగళూరు వద్ద కేవీజీ మెడికల్ కాలేజీలో గైనకాలజీలో పీజీ విద్యార్థిని. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో అదే మెడికల్ కాలేజీలోనే వైద్యం చేయించుకుంది. డెంగీ అని నిర్ధారణ కాగా ప్లేట్‌లేట్స్ తగ్గిపోయాయి. సరైన వైద్యం అందించకపోవడంతో ఆరోగ్యం విషమించింది. కాలేజీ సిబ్బంది ఆలస్యంగా తల్లిదండ్రులకు చెప్పడంతో హైదరాబాద్ నుంచి మంగళూరుకు బయలుదేరారు. డాక్టర్లు చేతులెత్తేసి మెరుగైన వైద్యం కోసం మంగళూరుకు వెళ్లాలని సూచించారు. వైద్య సిబ్బంది ఆమెను మంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో కోమాలోకి చేరుకుంది. కొన ఊపిరితో ఉన్న కుమార్తె ను చూసి తల్లడిల్లిపోయారు. చివరి మాటలకు కూడా నోచుకోలేదని విలపించారు. 21 తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కన్నుమూసిందని తల్లిదండ్రులు తెలిపారు.

స్పందన లేని వైద్యులు

తమ బిడ్డకు సరిగా వైద్యం చేయలేదని తల్లిదండ్రులు మంగళూరు నార్త్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కాలేజీకి వెళ్లి విచారణ జరిపారు. సృజని ట్రీట్‌మెంట్ గురించి వైద్యులు సరైన సమాధానం చెప్పలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారు జామున స్వగ్రామం పోట్లదుర్తికి మృతదేహాన్ని తీసుకువచ్చి మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

త్వరలో కోర్సు పూర్తి..

సృజని చదువులో మంచి ప్రతిభాశాలి. ఇంటర్ పూర్తయిన తరువాత మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీటు సాధించి హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సంపాదించింది. తరువాత సుళ్యలో పీజీ కోర్సు చివరి ఏడాది చేస్తోంది. ఆమె మరణంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. త్వరలో ఎంఎస్ పూర్తి చేసుకుని వస్తుందని కోటి ఆశలతో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడంలేదు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ వైద్య విద్యార్థినికే కనీస వైద్యం అందించకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి

కడప అర్బన్ : సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. కడప నగర శివారులోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లోని ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం జరిగితే ఎలా ఎదుర్కోవాలనే అంశంపై కార్మికులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఐఓసీ, హెచ్‌పిసిఎల్, ఆర్‌టిపిపి ప్లాంట్లు అందుబాటులో వున్నాయని, కనీసం నెలకు ఒకసారైనా అక్కడ మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ప్రమాదాలు సంభవించినపుడు రిస్క్‌టీం కార్మికులను సురక్షితంగా ఎలా రక్షించాలో ప్రదర్శన ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో కడప అగ్నిమాపక, జిల్లా సహాయాధికారి బసివిరెడ్డి, కడప రైల్వే స్టేషన్ మాస్టర్ శేఖర్‌కుమార్, ఐ.ఓ.సి డీజీఎం శివరామ్ కృష్ణతో పాటు, రిమ్స్ పీఎస్ ఎస్ఐ ఎర్రన్న, ఏఎస్ఐ శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


ఐఓసి ప్లాంట్‌లో విన్యాసాలు

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు

మైలవరం: అప్పుల బాధ తాళలేక చిన్న కొమెర్ల గ్రామానికి చెందిన రైతు కె.అశ్వర్థ గోపాల్‌రెడ్డి (60) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలవరం మండలంలో సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. చిన్న కొమెర్ల గ్రామానికి చెందిన అశ్వర్థ గోపాల్‌రెడ్డి తనకున్న ఐదెకరాలలో మిర్చి పంట సాగు చేస్తున్నాడు. దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మోనోక్రోటోఫాస్ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు జమ్మలమడుగు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రామలక్ష్మమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మట్టి తరలింపునకు అడ్డుకట్ట


ప్రొక్లెయిన్లు, టిప్పర్లు అడ్డుకుని వాగ్వాదానికి దిగిన గోవిందాయపల్లె గ్రామస్తులు

బి.కోడూరు : మండలంలోని గోవిందాయపల్లె చెరువు మట్టి అక్రమ తరలింపును ఆ గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లి ప్రొక్లెయిన్లు, టిప్పర్లతో మట్టి తవ్వకుండా నిలిపివేశారు. బి.కోడూరు పోలీసులు చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పారు. గుత్తేదారులు తమ వాహనాలను అక్కడి నుండి తరలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఆయకట్టు చెరువుపై ఇష్టానుసారంగా గోతులు తీస్తే నీరంతా వృథా పోతుందని, తాము పంటలు సాగు చేసుకోవడం ఎలా అని ప్రశ్నించారు. గోతులు తీయడం వలన ఆయకట్టుకు సరిపడా నీరందక నష్టపోవాల్సి వస్తుందని వారు తెలిపారు. మూడు గ్రామాలకు నీరందించే చెరువు మట్టి తరలించకుండా చూడాలని కోరారు.

చెరువు స్థలం కబ్జాకు యత్నం

బద్వేలు అర్బన్ : బద్వేలు–కడప రహదారిలోని బయనపల్లె చెరువులో చర్చి నిర్మాణం పేరుతో కొంత స్థలం కబ్జా చేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. మండలంలోని చింతలచెరువు పంచాయతీలోని బయనపల్లె గ్రామంలో 150 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. బద్వేల్–కడప రహదారికి ఆనుకుని ఉండడంతో 1.95 ఎకరాల స్థలం కొందరు చర్చి నిర్మాణం పేరుతో కబ్జా చేసేందుకు చదును చేసి శిలువను పాతారు. ఆ స్థలాన్ని శ్మశానంగా వాడుకుంటుండడంతో గ్రామస్థులు సోమవారం ఉదయం శిలువను తొలగించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో బయనపల్లె టీడీపీ నేత, మరో వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు కబ్జాకు యత్నించిన వారిని పిలిపించి హెచ్చరించారు.

వైద్య కళాశాల ప్రారంభానికి అడుగులు

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ పరిధి మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన వైద్య కళాశాల ప్రారంభానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. సోమవారం ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ బృందం సభ్యులు తొలుత మండలంలోని ఆరోగ్యవరం సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాలు, తరగతి గదులు, ల్యాబ్స్, బాలురు, బాలికల వసతి గృహ భవనాలను పరిశీలించారు. తర్వాత పట్టణంలోని మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిపై నిర్మించిన అదనపు గదులు, అవుట్ పేషెంట్ విభాగంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. నివేదిక తయారుచేసి నేషనల్ మెడికల్ కమిషన్‌కు అందజేయనున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

కారు ఢీ కొని వ్యక్తికి గాయాలు


కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రెడ్డినాయక్

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వల చెరువు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీ కొని రెడ్డినాయక్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని సుగాలిబిడికి గ్రామానికి చెందిన బుక్కె రెడ్డినాయక్ గువ్వల చెరువు సచివాలయంలో అంబాసిస్ లేబర్‌గా పని చేస్తున్నారు. సోమవారం విధుల్లో భాగంగా రోడ్డు దాటుతుండగా రాయచోటి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. రెడ్డినాయక్‌కు కింద పడి తలకు తీవ్ర గాయాలవడంతో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు..

మదనపల్లె: లారీ బోల్తా పడి డ్రైవర్ గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. తమిళనాడు నామక్కల్ జిల్లాకు చెందిన కాళియప్పన్ కుమారుడు వడివేలు (44) అనంతపురం నుంచి గోధుమలు లోడ్‌చేసుకుని తమిళనాడుకు బయలుదేరాడు. కురబలకోట మండలం చెన్నామర్రి మిట్ట వద్ద లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ వడివేలు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

చేపల కోసం వెళ్లి మృత్యువాత

బి.కొత్తకోట : ఆలేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యు వాత పడిన వ్యక్తి ఉదంతం సోమవారం వెలుగుచూసింది. హెడ్ కానిస్టేబుల్ రవీంద్రనాయక్ వివరాల మేరకు.. పెద్దతిప్పసముద్రం మండలం ఉప్పరవాండ్లపల్లెకు చెందిన ఎస్.నాగరాజు(49) శనివారం అర్ధరాత్రి బి.కొత్తకోట సమీపంలోని ఆలేరు వాగులో చేపలు పట్టుకొస్తానని భార్య ఈశ్వరమ్మకు చెప్పి వెళ్లాడు. వాగు వద్దకు వచ్చిన అతడు.. తిరిగి ఇంటికి వెళ్లలేదు. నాగరాజు కుటుంబీకులు వాగు పరిసరాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం వాగులో గుర్తుతెలియని మృతదేహం తేలియాడుతోందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఒడ్డుపై లభించిన చెప్పులు, ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు నాగరాజుగా గుర్తించారు. వాగులోకి దిగి చిక్కుకుని మృతి చెందాడా? ప్రమాదవశాత్తూ వాగులో పడి మరణించాడా? అన్నది తెలియాల్సి ఉంది. మృతుడి భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జీవశాస్త్రంలో నూతన ఆవిష్కరణలు

వైవీయూ జంతుశాస్త్ర ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి


జిల్లా కమిటీకి ఎంపికైన ఫోరం కమిటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు వారి పాఠ్యాంశాలను సూక్ష్మంగా పూర్తిచేసినూతన ఆవిష్కరణలు చేయడానికి జంతుశాస్త్రం ఉపయోగపడుతుందని యోగివేమన విశ్వ విద్యాలయం జంతు శాస్త్ర ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో కడప జిల్లా బయోలాజికల్ సైన్సు ఫోరం సర్వ సభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యోగివేమన విశ్వ విద్యాలయం జంతుశాస్త్ర ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్వీయ వ్యక్తీకరణ, స్వంతంత్ర పరిశోధన, నిర్మాణాత్మక కార్యకలాపాలు మొదలైనవి సైన్సు ఫోరం అందించే అవకాశాలన్నారు. అనంతరం వైఎస్సార్‌జిల్లా బయలాజికల్ సైన్స్ టీచర్ ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా వైవీయూ జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వెంకట్రామిరెడ్డి, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పత్తివెంకటక్రిష్టారెడ్డి గౌరవాధ్యక్షుడిగా ప్రధానోపాధ్యాయులు బాలఅంకిరెడ్డి, కేపే రేణుకాదేవి, అధ్యక్షుడిగా విజయప్రసాద్, ఉపాధ్యక్షులుగా సుజాతారాణి, శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామ్మోహన్, సంయుక్త కార్యదర్శిగా హరినాథరెడ్డి, మహిళా కార్యదర్శిగా విజయేశ్వరి, కోశాధికారిగా అయూబ్‌ఖాన్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా నరసింహులు, చెన్నారెడ్డి, అకడమిక్ కో ఆర్డినేటర్‌గా బాలకృష్ణ, టెక్నికల్ కో ఆర్డినేటర్‌గా సనావుల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యువతి హత్య కేసులో ఒకరికి జైలు శిక్ష


ముద్దాయి నవీన్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : రడేళ్ల క్రితం ప్రొద్దుటూరులో జరిగిన హైందవి హత్య కేసులో నిందితుడు నవీన్ కుమార్‌కు ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు గోకుల్ నగర్‌లో నివాసం ఉంటున్న హైందవి బీటెక్ పూర్తిచేసి బ్యాంక్ కోచింగ్ తీసుకుంటుండేది. రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌తోపాటు అతడి స్నేహితులు ఆమె ఇంట్లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో బాడుగకు ఉంటున్నారు.

ఈ క్రమంలోనే యువతి కుటుంబ సభ్యులతో నవీన్ కుమార్‌కు పరిచయం ఏర్పడింది. 2017 జూలై, 21న నవీన్‌కుమార్ బైక్‌లో వెళ్తుండగా మధ్యలో పెట్రోల్ అయిపోవడంతో ఆపి నిల్చొని ఉన్నాడు. అదే సమయంలో స్కూటీలో ఇంటికి వస్తున్న హైందవి బండికి ఏమైందని అడగ్గా..పెట్రోల్ లేదని చెప్పాడు. తనను ఇంటి దగ్గర డ్రాప్ చేసి..స్కూటీ తీసుకెళ్లి పెట్రోల్ తెచ్చుకోవాలని యువతి చెప్పింది. నిందితుడు నవీన్‌కుమార్ యువతి వెంట స్కూటీలో ఇంటికి వెళ్లాడు. హైందవి ఒంటరిగా ఉందని గమనించి ఇంట్లో ఉన్న కత్తి తీసుకొని ఆమె గొంతుకోసి హత్య చేశాడు. యువతి మెడలో బంగారు నగలు తీసుకొని పరారయ్యాడు. అప్పటి సీఐ సదాశివయ్య కేసులో నవీన్‌కుమార్‌ను కొన్ని గంటల్లోనే అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టులో విచారణ జరగ్గా జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ సోమవారం నవీన్‌కుమార్‌కు యావజ్జీవ శిక్షతోపాటు రూ.1.50 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా కట్టలేని పక్షంలో అదనంగా మరో 6 ఏళ్ల 9 రోజులు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

కక్షసాధింపు చర్యలను కలిసికట్టుగా ఎదుర్కొందాం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై అధికార పార్టీ నాయకుల దాడులు, కక్ష సాధింపు చర్యలను కలిసి కట్టుగా సమర్థంగా ఎదుర్కొందామని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో బద్వేలు రూరల్, మున్సిపాలిటి, బి.కోడూరు, పోరుమామిళ్ల మండలాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాటం చేద్దామని అన్నారు. తన విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, బి.కోడూరు మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, పుత్తాశ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, కుప్పాలశ్రీరాములు, నాగేశ్వర్‌రావు, మురళి, ప్రహల్లాదరెడ్డి, పరుశురామరెడ్డి, యువజన విభాగం నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.